

స్పందన అర్జీదారులను సంతృప్తిపరచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించడంతోపాటు ఆర్జీదారులకు సంతృప్తికరమైన సేవలందించాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నుండి 152 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులను ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి జెవి.మురళీ, ఆర్‌డిఒ కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమ పరిపాలనకు ఏడాది పూర్తి

వెంటాడుతున్న పలు సమస్యలు
వేధిస్తున్న సిబ్బంది కొరత
నేటికీ ఏలూరుతో ముడిపడి ఉన్న కొన్ని కీలక శాఖలు
అద్దె భవనాల్లోనే కీలక శాఖలు
సమర్ధవంతంగా 'స్పందన'
రూ.70 కోట్లతో భీమవరం టౌన్, రూ.8 కోట్లతో కలెక్టరేట్ అభివృద్ధి


అధ్వానంగా ఉన్న కలెక్టరేట్ రహదారి


కలెక్టరేట్ భవనం

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడి నేటికి ఏడాది పూర్తయింది. అయితే పాలనాపరమైన అంశాల్లో ముందు వెళున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం నత్తతో పోటీ పడుతుంది. జిల్లా అధికారయంత్రాంగం కొత్త సవాళ్లను ఎదుర్కొని సమన్వయంతో దూసుకుపోతున్నప్పటికీ దీర్ఘకాలిక సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లా ఏర్పడి ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఏలూరు జిల్లాతో కొన్ని శాఖలు నేటికీ ముడిపడి ఉన్నాయి. అధికారుల, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఇలా అనేక సమస్యలు జిల్లానవాసులను కలవరపెడుతున్నాయి.

సుపరిపాలన, ప్రజలకు అధికారులను మరింత చేరువ చేసే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం జిల్లాల విభజనకు శ్రీకారం చుట్టింది. భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడి మంగళవారానికి ఏడాది పూర్తవుతుంది. గతేడాది ఏప్రిల్ నాలుగో తేదీన కొత్త జిల్లా ఏర్పడింది. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాలతో అవతరించగా.. ఇటీవల ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని కూడా విలీనం చేయడంతో 20 మండలాలతో కొత్త జిల్లా సంతరించుకుంది. భీమవరం జిల్లా కేంద్రం ఏర్పడినప్పటి నుంచి కలెక్టర్, ఎస్‌పితో సహా జిల్లా అధికారులు కొలువుతీరి పరిపాలనను సాగిస్తున్నారు. అయితే అప్పటినుంచి కొన్ని దీర్ఘకాలిక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. జిల్లా కలెక్టరేట్‌ను ఏడో వార్డులోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఏర్పాటు చేవారు. ఇక్కడ 66 శాఖలో ఏర్పాటు కావాల్సి ఉండగా ఏడాది పూర్తయినప్పటికీ కేవలం 26 జిల్లాస్థాయి శాఖలు మాత్రమే ఏర్పాటయ్యాయి. మిగిలిన కొన్ని శాఖలు కలెక్టరేట్ భవనంలో కాకుండా పట్టణానికి దూరంగా వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఇవి కూడా అక్కడ అద్దె భవనాల్లో నేటికీ ఉన్నాయి.

రూ.8 కోట్లతో కలెక్టరేట్ అభివృద్ధి

జిల్లాల విభజన జరగడం, హడావుడిగా పరిపాలన కార్యకలాపాలు చేపట్టడంతో మౌలిక వసతులు, ఫర్నీచర్ వంటి ఇబ్బందులు ఏర్పడినప్పటికీ జిల్లా అధికారయంత్రాంగం పరిపాలన సమర్ధవంతంగా నిర్వహించింది. భవనంలో కొన్ని గదుల నిర్మాణం, ఫర్నీచర్, మౌలిక వసతులు, తాగునీరు మరుగుదొడ్లు వాటికి రూ.ఎనిమిది నుంచి రూ.పది కోట్ల వరకూ ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని కీలక సమయాల్లో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజానీకానికి పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు అందడం లేదు.

అధ్వానంగా కలెక్టరేట్ రహదారి

కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు అత్యంత అధ్వానంగా ఉంది. రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.80 లక్షలతో ఐదు నెలల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ నిర్మాణం చేపట్టలేదు. కలెక్టరేట్‌కు వేరే మార్గం గుండా వెళ్లే జిఅండ్‌వి కెనాల్ వెంబడి రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు.

ప్రజలకు తప్పని వ్యయప్రయాసలు

వివిధ సమస్యలపై కలెక్టరేట్ వెళ్లే వారికి వ్యయప్రయాసలు తప్పడం లేదు. భీమవరం బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ఆరు కిలోమీటర్లు దూరం ఉంది. విస్సాకోడేరు మెయిన్ రోడ్ నుంచి కలెక్టరేట్‌కు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. కలెక్టరేట్‌కు వెళ్లేందుకు వాహనాలు అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ.50 నుంచి రూ.వంద వరకూ ప్రయాణానికి ఖర్చు చేయాల్సిన వస్తుంది. కలెక్టరేట్ ఉద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు నిలిపేందుకు షెడ్లు కూడా లేవు. అలాగే కలెక్టరేట్‌కు వచ్చిన వారు విశ్రాంతి తీసుకునేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమర్ధవంతంగా స్పందన నిర్వహణ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమాన్ని జిల్లా అధికారి యంత్రాంగం సమర్ధవంతంగా నిర్వహిస్తుంది. ప్రతీవారం 150 నుంచి 300 వరకూ అర్జీలు వస్తున్నాయి. ఏడాదిలో 15,423 స్పందన ఫిర్యాదులు రాగా దీనిలో 14,774 ఫిర్యాదులు పరిష్కరించారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో వంద ఫిర్యాదులు అందినప్పటికీ జిల్లా ఏర్పడిన తర్వాత ఫిర్యాదులు మూడింతలు పెరిగాయి.

సవాళ్లను ఎదుర్కొని

జిల్లా ఏర్పడిన తర్వాత అనేక సవాళ్లు ఎదురయ్యాయి. రెండు పర్యాయాలు వచ్చిన వరదలకు జిల్లా తీరప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. లంక గ్రామాలు, పంటలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో జిల్లాయంత్రాంగం అనేక సేవలందించింది. ప్రతిఏటా ముంపునకు గురై సుమారు 60 వేల ఎకరాల్లో ఎలాంటి పంటలూ వేయకుండా వదిలేశారు. ఈ నేపథ్యంలో రూ.26 కోట్ల 32 లక్షలతో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా పర్యటనకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు. విపరీతమైన వర్షాలు ఉండటంతో అధికారులకు కత్తిమీద సాములా పర్యటన మారింది. అందరి సహకారంతో సమర్ధవంతంగా మోడీ పర్యటన విజయవంతం చేశారు. అలాగే సిఎం జగన్ కూడా నాలుగుసార్లు జిల్లా పర్యటన చేశారు.

ఏలూరు జిల్లా తోనే ముడిపడి

పశ్చిమ జిల్లా ఏర్పడి ఏడాది పూర్తవుతున్నప్పటికీ కొన్ని కీలక శాఖలు ఏలూరు జిల్లాతో ముడిపడి ఉన్నాయి. వైద్యం, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పర్యావరణ కాలుష్యం నియంత్రణ వంటి కీలకశాఖలు ఏలూరు జిల్లాతో ముడిపడి ఉన్నాయి. ఈ శాఖలకు సంబంధించి కొన్ని నిర్ణయాలు అక్కడ నుంచి జరగడంతో స్థానికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాస్థాయి కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొల్లలకోడేరులో ఏర్పాటు చేసిన జిల్లా ఎస్‌పి కార్యాలయం అద్దె భవనంలోనే ఉంది. అలాగే మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. భీమవారానికి దూరంగా తాడేరు రోడ్‌లో డిఆర్‌డిఎ కార్యాలయం కొనసాగుతుంది.

రూ. 70 కోట్లతో జిల్లా కేంద్రం అభివృద్ధి

జిల్లా కేంద్రం భీమవరం అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఏడాది కాలంలో పట్టణాన్ని అన్ని హంగులతో సుందరీకరణ చేపట్టారు. ప్రధాన సెంటర్లు, కూడళ్లలో విద్యుత్ కాంతులు వెల్లువిరుస్తున్నాయి. రహదారుల వెంబడి మార్జిన్ ఏర్పాటు చేసి టైల్స్ వేశారు. ఈ ఏడాది కాలంలో రూ.70 కోట్ల మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు.

ప్రాధాన్యత అంశాలు

భీమవరంలో కలెక్టరేట్ భవనానికి భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్లు కాగా 2,278 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సుమారు 18.45 లక్షల జనాభా ఉంది. జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు భీమవరం 30 కిలో మీటర్లలోపు దూరంలోనే ఉండటంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పనున్నాయి. అలాగే గణపవరం మండలాన్ని భీమవరం జిల్లాలో విలీనం చేశారు. తాడేపల్లిగూడేన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భీమవరంలో రోడ్ల విస్తరణ, రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం, పట్టణ సుందరీకరణ పనులు జరిగాయి. అలాగే పాలకొల్లులో వైద్యకళాశాల, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్, వశిష్ట వారధి, భీమవరంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

జిల్లావాసులు లౌక్యంగా ఉంటారు

పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్



జిల్లావాసులు ఎంతో లౌక్యంగా ఉంటారు. జిల్లా అభివృద్ధికి అధికారి యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లావాసులు, దాతలు అందించిన సహకారం మరువలేనిది. ఏడాదిలో ఎన్నో సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం. జిల్లా కేంద్రాన్ని రూ.70 కోట్లతో అభివృద్ధి చేశాం. ఆక్వా సాగుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ సాగుపై ప్రధాన దృష్టి పెట్టాము. అందరి సహకారంతో రెండో ఏడాదిలో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాను.

మాటలేనా.. చేతలేవి..!

ముందుకు సాగని 'వాటర్‌గ్రిడ్' పథకం
నాలుగేళ్లుగా సర్వేలతోనే కాలక్షేపం
డెల్టాలో గుక్కెడు నీటికోసం జనం అవస్థలు
గత ఎన్నికల్లో జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీ ఇదే
రూ.3670 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు నిధుల కుదింపు
అయినప్పటికీ తాగునీరు అందించే చర్యలు శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'వైసిపి అధికారంలోకొస్తే జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ వేసి వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా తాగునీరు అందిస్తాం. తమ ప్రభుత్వం రాగానే ముందుగా వాటర్‌గ్రిడ్ పథకం పూర్తిచేస్తాం..' ఇదీ 2019 ఎన్నికల్లో వైసిపి అధినేత జగన్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో జిల్లాప్రజలకు ఇచ్చిన హామీ. అధికారం చేపట్టి నాలుగేళ్లు గడిచిపోయింది. పథకాన్ని కుదించడమే కాకుండా ఇప్పటికీ సర్వేల పేరుతో కాలక్షేపం చేస్తూనే ఉన్నారు. వైసిపి వాటర్‌గ్రిడ్‌పై మాటిచ్చి మరిచిపోవడంపై జిల్లా ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రెండు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగిన చేపలు, రొయ్యల చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. ముఖ్యంగా డెల్టా మండలాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. దశాబ్దకాలంగా జనం తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల లేక అల్లాడిపోతున్నారు. డబ్బు చెల్లిస్తే తప్ప గొంతు తడవని పరిస్థితి నెలకొంది. 2014లో టిడిపి ప్రభుత్వం ప్రతీ ఇంటికి 20 లీటర్ల తాగునీరు అందిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఉమ్మడిజిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుచుకుంది. గెలిచిన తర్వాత తాగునీరు అందించకుండా జనాలను మోసం చేసింది. దీంతో ఆ పార్టీపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ తరుణంలో వైసిపి 2019 ఎన్నికల్లో తాగునీటి సమస్యను ఒక అస్త్రంగా ఉపయోగించుకుంది. జగన్ తన పాదయాత్ర జిల్లాలో జరిగినప్పుడు ఇదే ప్రధానంశంగా మారింది. బాటిల్‌లో నీళ్లు చూపించి ఈ నీరు మనుషులు తాగుతారా అంటూ జగన్ జనాలను ప్రశ్నించేవారు. వైసిపి అధికారంలోకొస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ ద్వారా అప్పటి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 48 మండలాలకు సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇది నమ్మిన ప్రజలు వైసిపిని 13 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించారు. అధికారంలోకొచ్చిన వెంటనే వాటర్‌గ్రిడ్ పథకంపై ప్రజాప్రతినిధులు చాలా హడావుడి చేశారు. దీంతో ఇంకేముంది సురక్షితమైన తాగునీరు వస్తాయని ప్రజలు సంతోషించారు. వాటర్‌గ్రిడ్ పథకానికి రూ.3,670 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్లలో ఈ పథకం పూర్తిచేస్తామని చెప్పారు. గోదావరి నదిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, అరికిరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టిమ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ల ద్వారా తాగునీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. నరసాపురం, భీమవరం ప్రాంతాల మీదుగా ఒకపైప్‌లైన్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు వరకూ ఒకటి, పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం వరకూ ఇంకో లైన్, కొవ్వూరు, గోపాలపురం, నల్లజర్ల మీదుగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పైప్‌లైన్లకు మధ్యలో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు సైతం ఏర్పాటు చేసి రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

సర్వేలతో కాలక్షేపం

వాటర్‌గ్రిడ్ పనులు నేటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. దీంతో జనాలనుంచి విమర్శలు రావడంతో మరో కొత్త ప్రణాళిక రూపొందించారు. మెట్ట ప్రాంతం వదిలేసి డెల్టాలోని 27 మండలాలకు వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. నిధులు రూ.3,670 కోట్లనుంచి రూ.1400 కోట్లకు కుదించారు. డెల్టా పరిస్థితి దారుణంగా ఉండటంతో ముందుగా ఇక్కడైనా పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుందని అంతా సర్దుకున్నారు. నాలుగేళ్ల గడిచిపోయింది. మరో ఏడాదిలో వైసిపి ప్రభుత్వం పదవీకాలం ముగుస్తోంది. వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, మెగా కంపెనీ దక్కించుకున్నట్లు చెబుతున్నారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఎవరైనా అడిగితే ఇంకా సర్వే జరుగుతుందంటూ చెబుతున్నారు. సర్వే ఎప్పటికి పూర్తవుతుందో, వాటర్‌గ్రిడ్ పనులు ఎప్పటికి మొదలవుతాయో.. ప్రజలకు తాగునీరు ఎప్పుడు అందిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు రోడ్ల మరమ్మత్తులకు శంకుస్థాపనలు చేసి హడావుడి చేసినట్లు.. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం వాటర్‌గ్రిడ్‌పై మళ్లీ హడావుడి చేసే పరిస్థితి ఉందని అంతటా చర్చ సాగుతోంది. తాగునీరు కోసం అల్లాడుతున్న ప్రజలను ప్రభుత్వాలు చేస్తున్న మోసాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.


చలో ఢిల్లీకి సిపిఎం సంపూర్ణ మద్దతు

భీమవరం : ఈ నెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తూ నిరంకుశత్వంగా పాలన సాగిస్తోందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి దేశ రైతాంగాన్ని మోసం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా దానికి భిన్నంగా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసే నూతన వ్యవసాయ చట్టాలు తెచ్చారని విమర్శించారు. వీటిపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో గత్యంతరం లేని స్థితిలో వెనక్కి తీసుకున్నారని తెలిపారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కోసం తుంగలో తొక్కుతూ వాటిని కాలరాస్తున్నారన్నారు. దేశ కార్మిక రంగానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను తక్షణం ఉపసంహరించుకుని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా తొలిరోజు పది పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. భీమవరంలోని సెంట్ మేరీ హైస్కూల్, పిఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్, భాష్యం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంత మంది పరీక్షకు హాజరు కావాలి, ఎంతమంది హాజరయ్యారని ఆరా తీశారు. పరీక్షల నిర్వహణ అంతా సీసీ టీవీలతో పర్యవేక్షణను జిల్లా కలెక్టరు స్వయంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరు వెంట డిఇఒ ఆర్.వెంకటరమణ ఉన్నారు.


భీమవరం : పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్


పాలకొల్లు : నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


ఆకివీడు : పరీక్ష రాసి బయటికొచ్చిన విద్యార్థులు

పాలకోడేరు : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గొల్లలకోడేరు, పాలకోడేరు, శృంగవృక్షం, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల్లో మొదటి రోజు మొత్తం 664 మంది విద్యార్థులకు గాను 651 మంది హాజరైనట్లు ఎంఇఒ పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. 13 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు.

ఆచంట: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు రూట్ ఆఫీసర్ సిహెచ్ సురేష్ బాబు తెలిపారు. 559 మంది విద్యార్థులకు గాను 555 మంది పరీక్షకు హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. ఆచంటలో ఇద్దరు, కొడమంచిలిలో ఒకరు, వల్లూరు ఎంపిపాలెంలో ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు.

అత్తిలి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న తెలిపారు. 507 మంది విద్యార్థులకు 8 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అత్తిలి గౌతమ్స్‌లో ఒకరు, బల్లిపాడులో ఒకరు, కొమ్మర ముగ్గురు, ఆరవల్లిలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

కాళ్ల : మండలంలోని కలవపూడి, ఏలూరుపాడు, కాళ్ల, కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది ప్రభుత్వ హైస్కూళ్లు, రెండు ప్రయివేటు పాఠశాలల నుంచి మొత్తం 682 మంది విద్యార్థులకు గాను 674 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ ఎ.రవీంద్ర తెలిపారు.

పెనుమంట్ర : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న అన్నారు. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో 569 మందికిగాను 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. మార్టేరు ఎస్‌విజిహెచ్ పరీక్షా కేంద్రాన్ని భీమవరం డివైఇఒ ఆర్‌వి.రమణ, పెనుమంట్ర, పొలమూరు హైస్కూల్‌ను ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న , తహశీల్దార్ దండు అశోక్ వర్మ పరిశీలించారు.

ఉండి : మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు తెలుగు పరీక్షకు 661 మంది విద్యార్థులకు గాను 647 మంది హాజరయ్యారని ఎంఇఒ రవీంద్ర తెలిపారు. 14 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పెంటపాడు : పెంటపాడు ఎస్‌టివిఎన్ హిందూ హైస్కూల్లో సోమవారం సుమారు 400 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు వారికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది. ఒక్క పోస్ట్ బేస్ స్కూల్ నుంచే 127 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్పెషల్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకివీడు : మండలంలో పదో తరగతి పరీక్షలు నాలుగు పరీక్షా కేంద్రాల్లో జరిగాయి. మొత్తం 860 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 848 మందే రాశారని ఎంఇఒ రవీంద్ర తెలిపారు. 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మొట్టమొదటి రోజు తెలుగు పరీక్ష కట్టుదిట్టంగా ప్రశాంతంగా జరిగింది. సీసీ కెమెరాల మోటున పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామంటూ అధికారులు ఇచ్చిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

పెనుగొండ : మండలంలోని పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని ఎంఇఒ డి.సుభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 5 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, మొత్తం 1033 విద్యార్థులకు గాను 1014 మంది హాజరయ్యారని, 19 గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి పరిశీలించారు.

పాలకొల్లు : 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఏడు సెంటర్లలో మొత్తం 1244 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకూ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలకు రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను తరలించారు. పట్టణ సిఐ డి.రాంబాబు, పట్టణ ఎస్ఐ ముత్యాలరావు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

గణపవరం : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ పి.శేషు చెప్పారు. మొత్తం 847 మంది హాజరు కావాల్సి ఉండగా 822 మంది హాజరైనట్లు చెప్పారు. 25 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

మొగల్తూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 881 మందికి 866 మంది హాజరయ్యారు. మొగల్తూరు ఎ సెంటర్‌లో ఒకరు, బి సెంటర్లో ఒకరు, ముత్యాలపల్లిలో ముగ్గురు, శేరేపాలెంలో ఒకరు, జగన్నాథపురం ఐదుగురు, కేపీ పాలెంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇన్‌ఛార్జి ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు.

పోడూరు : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం ఎనిమిది పాఠశాలల నుండి 454 మంది విద్యార్థులకు గానూ 446 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా హెల్త్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

పాలకొల్లు రూరల్ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. రూరల్ మండలంలో నిర్వహించిన రెండు కేంద్రాల్లో, ఏ సెంటర్లో 172 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారు. బి సెంటర్లో 166 మంది విద్యార్థులకు గాను 160 మంది మాత్రమే హాజరయ్యారు. శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 71 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు ఐదుగురు పరీక్షకు హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో అన్ని సదుపాయాలూ కల్పించామని ఎంఇఒ ప్రసాద్ చెప్పారు.

కొత్త టెండర్ విధానం రద్దు చేయాలని..
ఎపి సీడ్స్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - తణుకు రూరల్


భిక్షాటన చేస్తున్న కార్మికులు, నేతలు

కొత్త టెండర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఎపి సీడ్స్ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ భిక్షాటన తేతలి వైజంక్షన్ వరకూ నిర్వహించారు. కార్మికులను భిక్షాధికారులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ ఎపి సీడ్స్‌లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ హమాలీల కూడు లాక్కోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇంత అన్యాయం జరుగుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం బాధాకరమన్నారు. సీడ్స్‌లో అనేక ఏళ్లు గా ఉన్న యూనియన్‌ను తొలగించడం కోసం లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, గార రంగారావు, టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, సాంబశివరావు, శ్రీహరి, వరలక్ష్మి, రూతమ్మ, విక్టోరియా, లక్ష్మి,వెంకట లక్ష్మి, నిర్మలా, పావని పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెనుగొండ


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఎండిఒకు నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కార్మికులకు వేతనం పెంచడం లేదని తెలిపారు. వేతనాలు పెంచి కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. చనిపోయిన కాంట్రాక్టు వర్కర్లకు చెల్లించాల్సిన మట్టి ఖర్చులు పంచాయతీ వారు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ పేరుతో కార్మికులకు వేధింపులు పెరుగుతున్నాయని, టెండర్ విధానం రద్దుచేసి 30 సంవత్సరాలుపైగా సీనియార్టీగా ఉన్న వారిని యథావిధిగా కొనసాగించాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేసి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న బీమా పథకాన్ని ప్రతి పంచాయతీ కార్మికునికీ అమలు చేయాలని, బీమా రుసుం ఏటా పంచాయతీ యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులపై పనిభారం తగ్గించాలని, అదనపు సిబ్బందిని సమకూర్చుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు మాదాసు నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

గ్రూప్ -4 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈనెల నాలుగో తేదీన నిర్వహించనున్న ఎపిపిఎస్‌సి గ్రూప్-4 పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా రెవెన్యూ అధికారి కొమ్మెర కృష్ణవేణి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గ్రూప్-4 పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో డిఆర్‌ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-4 సర్వీసెస్‌కు సంబంధించిన పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షలను జిల్లాలోని మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క షిఫ్టుకు 385 మంది చొప్పున అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కొక్క షిఫ్టుకు 175 మంది, తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కొక్క షిఫ్టుకు 120 మంది, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ ఒక్కొక్క షిఫ్టుకు 90 మంది చొప్పున అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9:30 నుండి 12 గంటల వరకూ, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుండి ఐదు గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. వంద మీటర్ల లోపలి జిరాక్స్ షాపులను పరీక్ష ముగిసే వరకూ మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పరీక్ష హాలులోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించడం జరగదని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ జి.వసంతకుమార్, అసిస్టెంట్ సెక్షన్ అధికారి పి.రమేష్, లైజాన్ ఆఫీసర్లు పి.అనురాధ, కె.ఎలియమ్మ, శివ శంకర్, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, ఎపిఇపిడిసిఎల్ ఇఇ అహ్మద్ ఖాన్, సిఐ సిహెచ్.నాగప్రసాద్ పాల్గొన్నారు.



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

65 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని అర్ధవరంలో సోమవారం స్థానిక సచివాలయం వద్ద కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 65 మందికి కళ్లజోళ్లు పడతాయని వైద్యులు ఐ.శ్రీనివాసు చెప్పారు. అనంతరం పారిశుధ్య నిర్మూలనపై స్థానికులకు అవగాహన కల్పించారు. డాక్టర్ పి.సంతోష్ మాట్లాడుతూ వారానికొకసారి ఫ్రైడే డ్రైడే పాటించి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది లక్ష్మీకాంత, బి.రవికుమార్ పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పిల్లలకు పోషకాహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మార్టేరు సర్పంచ్ మట్టా కుమారి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా హెల్దీ బేబీ నిర్వహించి విజేతలకు సర్పంచ్ సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మట్టా కుమారి మాట్లాడుతూ పిల్లలకు ప్రతిరోజూ ఇచ్చే ఆహారంగా పాలు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి గౌరి సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, చిన్న సత్యనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వెలివర్రులో అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

వెలివర్రు గ్రామ దేవత వీర పేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వెలివర్రు గ్రామం నుండి మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 7000 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రుద్రరాజు ఫణి కిషోర్‌వర్మ, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్లు కల్లేపల్లి సతీష్ రాజు, ముదునూరి వీర్రాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, అడబాల వెంకటరాయుడు, కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్ కవలి శ్రీనివాస్, గంటా వెంకన్న, దేవరపల్లి సత్యనారాయణ, సోమిశెట్టి రత్నరావు పాల్గొన్నారు.

శశిలో ఎల్లో డే వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సోమవారం ఎల్లో డే సెలబ్రేషన్స్ స్కూల్ కరస్పాండెంట్ ఖండవల్లి శ్రీనివాస్, నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతిలో పసుపునకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. పసుపు రంగు ప్రశాంతతకు సూచికమన్నారు. అనంతరం పసుపు రంగు విశిష్టతను తెలియజేసే వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి

నేడు వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 4వ తేదీన రెండు గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మామిడూరులో, నాలుగు గంటలకు సోమరాజు ఇల్లిందలపర్రులో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

ఇంటి రుణం రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిలుకూరు, మహదేవపట్నం గ్రామాల్లో సచివాలయ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, మండల కార్యదర్శి తమరాని శ్రీనివాస్, సిపిఐ నాయకులు కోనా గొల్లయ్య పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో 22 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు 22 మంది విజయం సాధించారని ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.బాలనాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో కె.కార్తీక్, ద్వితీయ స్థానంలో బి.సత్యచంద్రశేఖర్, తృతీయ స్థానంలో సిహెచ్ జిజ్ఞాస్, ఏడో స్థానంలో టి.రాజేశ్వరి, ఎనిమిదో స్థానంలో ఆర్.లక్ష్మీ ప్రసన్న నిలిచారని తెలిపారు. ఆర్.లక్ష్మీగాయత్రి, డి.అభిషేక్‌పాల్, ది భార్గవ్, పి.నాగసాయి, కె.హేమంత్ రాఘవ, బి.భావన, బి.లక్ష్మణ్, కె.దీపిక, టి.రమ్యకృపశ్రీ, పి.దివ్యతేజ, కె, తరణి, కె.కార్తీక్, కె.పూజిత, ఎ.సుభాష్ రాజ్, ఆర్‌జెఎన్.వర్మ, దివ్యభవాని, టి.భవాని ఉత్తర్ణత సాధించారని బాలనాగమణి తెలిపారు. ఈ సంవత్సరం అత్యధికంగా 22 మంది విద్యార్థులు ఉత్తర్ణత సాధించారు. ఉత్తర్ణత సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయాన విద్యార్థులను, సిబ్బందిని సర్పంచి కొపనాతి పల్లయ్య, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ కొల్లాటి నాగరాజు, ఎంపిటిసి సభ్యులు తిరుమాని స్వామి, రేవు రాంబాబు అభినందించారు.



ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కొనసాగిన ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్రవీడి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన 26వ రోజు సోమవారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా ఉద్యోగులు సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగించుకుని కలెక్టరేట్ ఎదురుగా నిరసన తెలిపారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిఎ బకాయిలు మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిశోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, సిహెచ్.రవికుమార్, నిజాముద్దీన్‌షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్ పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న గృహ నిర్మాణాలపై జిల్లా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తక్కువ నిర్మాణాలు మొదలు పెట్టడంపై కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్లో వారంరోజుల్లోగా లెవెలింగ్, రోడ్డు పనులు త్వరితగతన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో వచ్చే వారానికి 280 నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. తహశీల్దార్, ఎండిఒ గృహ నిర్మాణ శాఖ ఎఇ వారీగా ప్రత్యేక అధికారులు సమీక్షించి పనులు ఎక్కడ మందకొడిగా సాగుతున్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందికి సాంకేతిక నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జాతీయ, ఆరోగ్య కార్యక్రమాల అమల్లో సిబ్బందికి సాంకేతికత నైపుణ్యం అవసరమని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం (వీకెర్స్ కాలనీ, ఎన్‌టిఆర్ జంక్షన్, కడకట్ల, యాగర్లపల్లి)లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. జాతీయ కీటక జనిత వ్యాధులు, నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి తెలిపారు. ప్రతివారమూ జరుగుతున్న డ్రైడే ఫ్రైడే, ఫీవర్ సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా నోడల్ పర్సన్, ఆశాలు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డులోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈనెల నాలుగో తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, చెట్లు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

విఆర్‌ఒల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - కాళ్ల

విఆర్‌ఒల సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. తహశీల్దార్ కార్యాలయంలో కెడిఎస్ కెనడీ (విఆర్‌ఒ డివిజన్ అధ్యక్షులు) అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షులుగా నిట్టాల సీతారాం, ఉపాధ్యక్షులుగా గుర్రం చిట్టిబాబు, కార్యదర్శిగా కోమట సుబ్రహ్మణ్యం, ట్రెజరర్‌గా బి.రాజేశ్, జాయింట్ ట్రెజరర్‌గా ఎం.ప్రశాంత్ బాబు ఎన్నికయ్యారు.

డిఎస్‌సిని ప్రకటించాలని డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకీ పెరుగుతోందని, తక్షణం మెగా డిఎస్‌సిని వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, జిల్లా కమిటీ సభ్యులు వాసు, గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తానని జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

ఐపిఎల్‌లో అదరగొట్టిన ఠాగూర్ తిలక్ వర్మ

వాండ్రంలో సంబరాలు

ప్రజాశక్తి - ఉండి

ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో నంబూరి ఠాగూర్ తిలక్‌వర్మ అదరగొట్టారు. దీంతో వాండ్రం గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న నంబూరి ఠాగూర్ తిలక్ వర్మ అమ్మమ్మ స్వగ్రామం ఉండి మండలం వాండ్రం. అయితే ఆదివారం రాత్రి జరిగిన ముంబై ఇండియన్స్ ఆర్‌సిబి మ్యాచ్‌లో ఠాగూర్ తిలక్ వర్మ 84 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ గెలవడంతో గ్రామంలోని యువత, తిలక్ వర్మ అమ్మమ్మ తాతయ్య ఆనందం వ్యక్తం చేశారు. బాణా సంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. తిలక్ వర్మ ఐపిఎల్‌లోనే కాకుండా దేశానికి కూడా ఆడి అందరి మన్ననలను పొందాలని తిలక్ వర్మ అమ్మమ్మ తాతయ్య ఆకాక్షించారు. ఈ ఐపిఎల్‌లో రూ.కోటి 70 లక్షలు ముంబై ఇండియన్స్ జట్టు తీసుకుందని, అండర్ - 19 వరల్డ్ కప్ 2020లో జట్టులో ఆడాడని వారు తెలిపారు.

ఆప్తుడిని కోల్పోవడం బాధాకరం

మాజీ ఎంఎల్‌సి నారాయణరావు

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కన్నుమూసిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి తనకు అత్యంత ఆప్తుడని, అటువంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని మాజీ ఎంఎల్‌సి బొమ్మిడి నారాయణరావు అన్నారు. సోమవారం ఉప్పులూరులోని నారాయణస్వామి తనయులు నవీన్, సూర్యచంద్రరావును పరామర్శించి నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణస్వామి తనకు అత్యంత ఆప్తుడన్నారు. భీమవరం మాజీ ఎంఎల్‌ఎ పులవర్తి రామాంజనేయులు, తణుకు మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉండి మాజీ శాసనసభ్యులు వేటూరి వెంకట శివరామరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడారు. ఆయన మృతి గ్రామానికి, టిడిపికి తీరనిలోటని అన్నారు. యర్రా నారాయణస్వామి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారాయణ స్వామి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో గన్నాబత్తుల శ్రీనివాస్, గన్నాబత్తుల నాగేశ్వరరావు, తోట సత్యనారాయణ ఉన్నారు.

న్యాయం చేయండి

స్పందనలో రైతు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండి

చెరువులో అడ్డుగా వేసిన గట్టును తొలగించి తన పంట భూమి నుంచి మురుగు నీరు వెళ్లేలా చేయాలని రైతు సాగిరాజు సాంబశివరాజు స్పందనలో తహశీల్దార్ రవీంద్ర కుమార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. రైతు తెలిపిన వివరాల ప్రకారం. ఉండి గ్రామం పులిగుమ్మ సమీపంలో బొండాడ మురుగు కాలువను ఆనుకుని తనకు ఎకరా 25 సెంట్ల భూమి ఉందని, తన భూమిని, తన పక్కనే ఉన్న రైతు బెల్లపు రమేష్ భూమిని కొంతకాలం కితం ఇద్దరు కలిసి చెరువుగా తవ్వుకుని సాగు చేసుకున్నామని తెలిపారు. ఈ మధ్యకాలంలో బెల్లపు రమేష్ తన భూమి తనకు కావాలంటూ అడిగాడని, దానికి తాను కూడా సముఖత వ్యక్తం చేశానని, అయితే తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మురుగుబోదె హక్కు కల్పించకుండా చెరువులో అడ్డంగా రమేష్ గట్టు వేశాడని వారు వాపోయారు. అధికారులకు విన్నవించుకున్నా వారు సరిగ్గా స్పందించడం లేదని తెలిపారు. రమేష్‌ను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని, చేతనైంది చేసుకో అనే పద్ధతిలో అతని సమాధానం ఉండటంతో తాను స్పందనలో ఫిర్యాదు చేశానని వాపోయాడు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

విలేకరిపై దాడికి కారకులను శిక్షించాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఓ ఛానల్ విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు పట్టణ సిఐకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గత రాత్రి పులపర్తి నాని నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తుండగా ఇరువురు నేరస్తులు అతనిపై దాడి చేసి గాయపరిచారు. వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కెవిఎస్‌ఎల్‌ఎన్.రాజు, కోశాధికారి తోట రాంబాబు సిఐ డి.రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు పిటి వెంకటేశ్వరరావు, మంఢెల అప్పలరాజు, బుడ్డిగ గోపి, సరగం సత్యనారాయణ రేలంగి సుధాకర్, వెంకట్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ఐ.భీమవరం రోడ్డు మలుపు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకీ అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో యూనియన్ మండల కార్యదర్శి తవిటి అప్పారావు మాట్లాడారు. నిత్యావసరాలపై జిఎస్‌టిని పహరించాలని, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.అప్పలనాయుడు, నడిపూడి సత్యం, నెల్లి సూరిబాబు, రమణ, పేర్ల లక్ష్మినారాయణ, వాసురాజు, నడిమింటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కలవపూడిలో అమ్మవార్ల జాతర

కాళ్ల: కలవపూడిలో మారమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర సోమవారం వైభవంగా నిర్వహించారు. మోడీ గ్రామంలో జాతర సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆయన సోదరుడు మంతెన పెద నరసింహమూర్తి రాజు అమ్మవార్ల ఘటాలతో జాతరలో ఉత్సాహంగా చిందేశారు.

విస్సాకోడేరు అభివృద్ధి పనులపై సంతృప్తి

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరులో గత రెండేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై సర్పంచి బొల్ల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు సంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకోవడంతో పాటు గ్రామానికి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేసిన సర్పంచి శ్రీనివాస్‌ను సభ్యులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో గడిచిన రెండేళ్లలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో రెండు కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, మూడు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అలాగే సచివాలయ భవనాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం జిల్లా శిక్షణ కేంద్రంగా ఎంపిక కావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ, పెదపూడి లక్ష్మీపతి, కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ డిఆర్ స్వర్ణలత, ఉపసర్పంచ్ కందుల నాగరాజు, పాలకవర్గం సభ్యులు బాలాజీ, అంజి, చందు, పంచాయతీ కార్యదర్శి జార్జ్ ప్రసాద్ పాల్గొన్నారు.



సర్పంచి శ్రీనివాసును సత్కరిస్తున్న పంచాయతీ పాలకవర్గం సభ్యులు

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 385/2022

Between:
Parthi Hanumantha Rao ***...Plaintiff***
AND
Vinnakota Suryakumari, W/o. Gopi, Female, D.No. 9-121, Marteru, Penumentra Mandal, TJCJC
...Defendant

వాది తరుపు వేయించిన ప్రకటన

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా., పై నెంబరు దావాలో మీకు సమన్లు కోర్టు ద్వారా పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 17-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షములో దావా విచారణ చేసి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

G.VEERREDDY
Advocate for Plaintiff
Tanuku.
Tanuku,
03-04-2023. Cell: 94406 07793

రామచంద్ర రాజు కుటుంబానికి రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల మతి చెందిన కలిదిండి రామచంద్రరాజు కుటుంబాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు పరామర్శించారు. అనంతరం రామచంద్ర రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రరాజుకు సినీ రంగం అంటే మక్కువ ఎక్కువ అన్నారు. ఆ కారణం చేతనే భీమవరం, ఏలూరు పట్టణాల్లో ఆయన కుమార్తె పేర విజయలక్ష్మి థియేటర్లను నిర్మించారని తెలిపారు. ఆయన మృతి తీరని లోటు అని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా జిల్లా కో ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాస దొరబాబు, కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి భాస్కర్ రాజు పాల్గొన్నారు.

టిడిపి విజయానికి తెలుగు యువత కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

నూతనంగా ఎన్నికైన తెలుగు యువత అధ్యక్షులు రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని తెలుగు యువత మండల అధ్యక్షులు కేతా మురళి పిలుపునిచ్చారు. సోమవారం అయోధ్యలంకలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలో తెలుగు యువత అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తెలుగు యువత అయోధ్యలంక అధ్యక్షులుగా కడలి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం టిడిపి నాయకులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE 3rd ADDL. JUNIOR CIVIL JUDGE, MACHILIPATNAM
I.A. No. 212/2022 in OS.No. 344/2022

Between :
Vadlamudi Venkata Chalapathi Rao
... Petitioner / Plaintiff
And
Arava Mary Gold & others
... Respondents/ Defendants

To,
R2) Gollamandala Sumalatha W/o Sundhar Singh, D.No. 19-15-38, Teachers Street, Bank Colony Entrance, Bhimavaram, West Godavari Dist.
R6) Yannabattula Prakash, S/o Devid Raju, Blasilya Penthu kostu Church, Shantapet, Vissakoduru Mandal, West Godavari Dist.
R7) Yennabattula Shanthi Priya, D/o Devid Raju, Blasilya Penthu kostu Church, Shantapet, Vissakoduru Mandal, West Godavari Dist.

పై I.A. No. 212/2022 in OS.No. 344/2022రులో పై రెస్పాండెంట్స్ / ప్రతివాదులు అయిన 2, 6, 7లకు నోటీసులు అమలు నిమిత్తం ది. 24-4-2023వ తేదీకి వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

మచిలీపట్నం ఇట్లు
ది.03-04-2023 **Suresh Babu Perni,**
Advocate for Petitioner / Plaintiff
Machilipatnam.

ప్రకటన

In The Court Of The IV Addl. District Judge :: W.G.Dist :: Eluru
G.W.O.P.No. 42/2022

(In the matter of Minor Child to accord permission to his sell the Petition Schedule Property relating to 1) Sathuluri Venkata Sahil 2) Kum. Sathuluri Nirupama Aishwarya being minors represented by their Mother /Guardian Sathuluri Vijaya Lakshmi)

Between:
Petitioner: Sathuluri Vijaya Lakshmi
AND
Respondent: Nill

పై నెంబరు పిటీషను గ్రంథములో లేటు సాతులూరి నరిసింహని మరియు పిటీషనరు సాతులూరి విజయలక్ష్మి గారు సంతానము సాతులూరి వెంకట సుహిల్ మరియు సాతులూరి నిరుపమ ఐశ్వర్య గార్లకు చెందిన జాయింటు ఆస్థి అయిన ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్ముటకు కొరకు కోర్టు అనుమతి నిమిత్తం పై పిటీషను గ్రంథము దాఖలు చేసియున్నారు. ఇందుపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.10-04-2023 సం॥రం తేదీన గం॥ 10:30 ని॥లకు హాజరు అయ్యి వారి ఆక్షేపణలు శ్రీ కోర్టు వారికి తెలియపర్చు కొనవలసినదిగా తెలియజేయడమైనది.**

PETITION SCHEDULE

Item No.1:

A) West Godavari District, Tanuku SRO, Tanuku Sub Division, Tanuku Mandal, Tanuku Municipality area, Tanuku Vemavasram Village, Zirayoti Land, bearing R.S.No. 6/7A, nearer D.No. 17-140, new D.No. 17-14-8, Flat No. 5 (505) in Siri Plaza Apartments constructed by Siri Constructions an extent of 1234 Sq. Feet with common area Two Bed Room Flat within the following boundaries:
East: Corridor. ***West:*** Corridor. ***South:*** Corridor. ***North:*** Open to Sky.

Within the boundaries in an extent of 1234 Sq. Feet Two Bed Room flat within the above boundaries with Car parking and Electricity service connection 036138 along with scooter parking with undivided joint right of site to an extent of 51.8 Sq. Yards with all easementary rights therein.

B) The above flat situated in apartments constructed under A.P. Regulation and Penalization unapproved land illegal rules 2007 after getting regularization from Tanuku Municipality under LRS No. 71/2008 G1 dated 08-04-2020 an extent of 2072 Sq. Yards site within the following boundaries:
East: Site in R.S.No. 6/4 and 5 119'-08''.
West: Municipal Road 117'-08''.
South: Site in R.S.No. 6/7A 154'-00''.
North: Site in R.S.No. 6/1 160'-04''.

ITEM NO.2: 1/6th Undivided share of the minor in the above mentioned flat of 1234 Sq.feet and the Joint right of site to an extent of 51-8 Sq. Yards which comes to 205.66 Sq. feet with all easementary rights therein.

Tanuku, **N.V.S.S.P.RAMA MOHAN**
02-04-2023. **N.V.S.RAMANUJUM**
Advocates, Tanuku.
Cell: 99088 22433, 98483 69653